AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
31-8-2026 (Monday) MAIN EDITION

## హిందూ చట్టాన్ని రుద్దుతున్నారు : అసదుద్దీన్ ఒవైసీ



**అక్షరటుడే, హైదరాబాద్ :** న్యూయార్క్ పర్యటనలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. మోహన్ భగవత్ మాటలు ఆర్ఎస్ఎస్ అనుసరించే పాత వ్యూహంలో భాగమే అన్నారు. బయటి ప్రపంచం కోసం ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చేసే ప్రసంగాలకు, తమ సొంత సభ్యుల కోసం చేసే ప్రసంగాలకు మధ్య తేడా ఉంటుందని ఆరోపించారు. దేశంలో ఉమ్మడి పౌర స్మృతి ముసుగులో హిందూ చట్టాన్ని రుద్దుతున్నారని పేర్కొన్నారు. ఇది కూడా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమే అన్నారు.

## నర్సు హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని తుక్కుగూడలో నర్సు అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆమెను హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన ఎండీ సనావుల్లా ఖాన్ (34) హత్య చేసినట్లు తెలిపారు. సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. బైక్ మెకానిక్‌గా పని సనావుల్లా.. సుమారు నెల రోజులుగా నర్సు కదలికలను గమనించాడు. అర్ధరాత్రి కిటికీ ద్వారా నర్సు గదిలోకి ప్రవేశించాడు. అత్యాచారం చేయడానికి యత్నించగా ఆమె ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేశాడు.

### 22 శాతం లాభాలతో లిస్టయిన అగ్‌మోంట్ షేర్లు





**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** గోల్డ్ ట్రేడింగ్ చేసే అగ్‌మోంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో సుమారు 22 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. ఐపీవోకు మంచి స్పందన వచ్చినా.. మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో తక్కువ ప్రీమియంతో షేర్లు లిస్ట్ అయ్యాయి.

### అలంపూర్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన



**అక్షరటుడే, గద్వాల:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అలంపూర్ లో పర్యటించారు. ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన సోమవారం అలంపూర్ క్షేత్రాన్ని సందర్శించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం, జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### ఆర్ఎస్ఎస్ ద్వంద్వ వైఖరి: సీపీఐ నారాయణ



**అక్షరటుడే, ఏపీ:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రంగా స్పందించారు. అమెరికాలో మత సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడుతున్న మోహన్ భగవత్.. అదే మాటను భారతదేశంలో ఎందుకు ప్రకటించడం లేదన్నారు.

# ఢిల్లీలో మరో నిర్భయ

■ బస్సులో బాలికపై గ్యాంగ్‌రేప్ ■ ఘాతుకానికి పాల్పడిన డ్రైవర్, కండక్టర్ ■ నిందితుల అరెస్ట్

**దేశ రాజధాని ప్రాంతంలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ నుంచి వస్తున్న 16 ఏళ్ల మైనర్ బాలికపై ప్రైవేట్ స్లీపర్ బస్సులో డ్రైవర్, కండక్టర్ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆగస్టు 4న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులు కుల్దీప్, సందీప్‌లను అరెస్టు చేశారు.**

**- అక్షరటుడే, నేషనల్ డెస్క్**



యూపీలోని మైన్‌పురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల బాలిక 11వ తరగతి చదువుతోంది. సరిగా చదవడం లేదని తల్లి తిట్టడంతో ఆగస్టు 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నోయిడాలో ఉన్న తన బంధువును కలిసేందుకు బయల్దేరింది. ఈ క్రమంలో గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సు ఎక్కింది. ఆ సమయంలో బస్సులో ఎవరు లేరు. అయితే డ్రైవర్, కండక్టర్ ఆమెకు మాయమాటలు చెప్పారు. దీంతో నమ్మి బస్సులో ఎక్కింది. అనంతరం బలికను బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు.

**పోలీసుల దర్యాప్తు..**

బస్సు కిటికీలకు తెరలు వేసి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో బయటకు కనిపించలేదు. ఈ అదను చూసుకుని డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. అనంతరం కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద ఆమెను దింపి పరారయ్యారు. అచేతన స్థితిలో ఉన్న బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బస్సును గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరమ్మతు చేయించుకొని తిరిగి వస్తుండటంతో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరని పోలీసులు తెలిపారు.

## బిష్కెక్‌లో ప్రధాని మోదీ పర్యటన



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ చేరుకున్నారు. ఉజ్బెకిస్థాన్ పర్యటన ముగించుకున్న ఆయన కిర్గిస్థాన్‌లో బిష్కెక్‌కు వెళ్లారు. అక్కడ ఆయనకు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం బిష్కెక్‌లో నగరంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం పలు దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. రేపు బిష్కెక్‌లో జరిగే 26వ ఎస్‌సీవో సదస్సులో ఆయన పాల్గొంటారు.

## జాతీయ పతాకానికి అవమానం.. కేంద్ర మంత్రి ఆగ్రహం



**అక్షరటుడే, న్యూ ఢిల్లీ :** న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సమావేశం సమయంలో భారత జాతీయ జెండాను కాళ్లతో తొక్కడం, దానిని చింపివేయడం వంటి చర్యలకు పాల్పడిన నిరసనకారులు, ఖలిస్తానీ మద్దతుదారులను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు హెచ్చరించారు. రాజకీయ విభేదాలు ఉండటం సహజమేనని, కానీ దేశాన్ని అవమానించడం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. మా జెండాను, నా దేశాన్ని అవమానించకండి. దీనికి మీరు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అని ఎక్స్ వేదికగా ఆయన హెచ్చరించారు.



## నా కొడుకు టెర్రరిస్ట్ కాదు : యశ్ తల్లి కౌంటర్

**అక్షరటుడే, సినిమా డెస్క్:** కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేదు. అంతేగాకుండా ఈ మూవీపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, "KGFకి ముందు యష్ ఎవరు?" అని గతంలో నిర్మాత అల్లు అరవింద్ చేసిన వ్యాఖ్యపై యష్ తల్లి పుష్ప అరుణ్‌కుమార్ పరోక్షంగా స్పందించారు. KGFకి ముందు యష్ ఐదు సూపర్ హిట్ సినిమాల్లో నటించారని చెప్పారు. యశ్ ఉగ్రవాది కాదు కదా అన్నారు. KGFకి ముందు ఆయన ఎవరు అని అడగాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య


**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని అంబర్‌పేటలోని తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆమె కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి నిరాకరించారు. దీంతో మనస్థాపానికి గురైన నిభాస్ తిరుమలనగర్‌లోని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



## సింగర్ హత్య కేసులో నిందితుల ఎన్‌కౌంటర్



**అక్షరటుడే, యూపీ :** హర్యానాకు చెందిన గాయకుడు అంకిత్ బలియాన్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నిందితులు హతమయ్యారు. ఈ నెల 26న జిమ్ బయట అంకిత్ బలియాన్ హత్యకు గురయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 'జట్టన్' ప్రాంతంలో దుండగులు ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామని వారు తెలిపారు. నిందతులు కాల్పులు జరపడంతో తాము ఎదురు కాల్పులు చేశామన్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులు మృతి చెందారు.



## లారక్ ద్వీపంపై అమెరికా దాడి


**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తాజాగా ఇరాన్‌లోని లారక్ ద్వీపంపై అమెరికా దాడి చేసింది. దీంతో టెహ్రాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. హర్మూజ్ జలసంధిలోని లారాక్ ద్వీపంలో ఉన్న ఇరాన్‌కు చెందిన రెండు ప్రయోగ వ్యవస్థలపై అమెరికా దాడి చేసింది. ద్వీపంపై దాడి జరిగిందని ఐఆర్‌జీసీ ధృవీకరించింది. ఈ దాడిలో పలువురు సైనిక సిబ్బంది, పౌరులు మరణించారని పేర్కొంది. ఈ దాడికి ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది.

## ఓల్డ్ సిటీలో ఎంఐఎం నేత హత్య

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ పాతబస్తీలో ఎంఐఎం నాయకుడు మెహబూబ్ అలీ హత్యకు గురయ్యాడు. ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో గల వట్టేపల్లి ప్రాంతంలో గుంటల్ షా బాబా దర్గా సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మెహబూబ్ అలీపై కొందరు దాడి చేశారు. ఐదు నుంచి ఆరుగురు వ్యక్తులు అలీపై కత్తులతో దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు.



## నిరసనలను వాయిదా వేయాలని పిటిషన్



**అక్షరటుడే, ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), ఇతర సమూహం ప్రతిపాదించిన నిరసనలను వాయిదా వేయాలని దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా శాంతిభద్రతలపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఈ పిటిషన్‌ను ప్రస్తావించారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, నిరసనలలో హింస, సంబంధిత సమస్యలపై విచారణ జరిపేందుకు కోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ముందు పిటిషనర్ లేవనెత్తిన ఆందోళనలను ఉంచవచ్చని పేర్కొంది. నిరసనల సమయంలో హింస జరుగుతుందనే ఆందోళనపై ప్రస్తుతం ఎటువంటి ఆధారం లేదని కోర్టు పేర్కొంది.